## కూరగాయల ధరలు

**సనత్‌నగర్:** ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో.. )టమాటా.11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 21, క్యాప్సికమ్ 31, పచ్చకాకర 45, పందిరి బీర 40, క్యాబేజీ 8, క్యారెట్ 15, దొండ 40, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 24, ఆలుగడ్డ 21, చామగడ్డ 43, మొరంగడ్డ 23, కందగడ్డ 65, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

## నేడు ప్రత్యేక పూజలు

**సనత్‌నగర్:** సంకట హర చతుర్థి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం వినాయక ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణనాయుడు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు గణపతి హోమం, సాయంత్రం 6 గంటలకు పంచామృతాభిషేకం, అనంతరం ప్రత్యేక అలంకరణ దర్శనం, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

## రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నేతల ఫిర్యాదు



చిలకలగూడ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

**సికింద్రాబాద్:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వాఖ్యలపై సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ నాయకులు చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. బీఆర్‌ఎస్ యువజన నాయకుడు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్ నేతృత్వంలో పీఎస్‌కు తరలి వచ్చిన బీఆర్‌ఎస్ నాయకులు రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్ట్రెచ్చర్, మార్చురీ అనే పదాలను వినియోగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చాయన్నారు. అనుచిత వాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డిపై కేసులు నమోదు చేయాలని వారు పోలీసులకు కోరారు.

## అనస్థీషియాలజిస్టులను వైద్యులుగా గుర్తించాలి

**రాంగోపాల్‌పేట్:** అనస్థీషియాలజిస్టులను సమర్థవంతమైన వైద్యులుగా నేషనల్ మెడికల్ కౌన్సిల్ గుర్తించాలని సొసైటీ ఆఫ్ పెరిఆపరేటివ్ ఫిజీషియన్ అనస్థీషియాలజిస్ట్స్ (ఎస్‌వోపీపీఏ) విజ్ఞప్తి చేసింది. ఆదివారం సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి ఆడిటోరియంలో ఎస్‌వోపీపీఏ ఆధ్వర్యంలో శాస్త్రీయ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ, ప్రొఫెసర్ మణిమాలారావు, కార్యదర్శి డాక్టర్ రాజా నిర్సంగ్‌రావు, సభ్యురాలు డాక్టర్ ఎస్ కల్యాణీతో పాటు సుమారు వంద మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శస్త్ర చికిత్సకు ముందు తర్వాత అనస్థీషియాలజిస్టుల పాత్ర ఎంతో కీలకమైనదని పలువురు వైద్యులు అభిప్రాయపడ్డారు. అనస్థీషియాలజిస్టులు శస్త్ర చికిత్స తర్వాత రోగి ఇంటికి చేరుకునేంత వరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకునే పెరియాపరేటివ్ ఫిజీషియన్ అని అన్నారు.


## వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం



స్వర్ణలత (ఫైల్)

**అడ్డగుట్ట:** వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన మేరకు.. మౌలాలి ప్రాంతానికి చెందిన స్వర్ణలత(36) తుకారాంగేట్ మీనా హాస్పిటల్ సమీప ప్రాంతంలో నివాసముంటున్న తన తల్లి ఇంటికి నెల క్రితం వచ్చి ఇక్కడే ఉంటుంది. మల్కాజ్‌గిరిలోని ఓ హోటల్‌లో పని చేస్తున్న స్వర్ణలత ఈ నెల 15న పనికి వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. అయితే ఆ తరువాత ఇంటికి రాలేదు. దీంతో ఆదివారం తల్లి పత్రిమణి తుకారాంగేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**పనికి వెళుతున్నానంటూ యువకుడు...**



మహ్మద్ షరీఫ్

తుకారాంగేట్ ప్రాంతానికి చెందిన మహ్మద్ షరీఫ్(25) ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 6న పనిపై వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అయితే ఇంటికి తిరిగిరాలేదు. దీంతో అతని భార్య సారా దీవాన్ ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. తిరిగి రాకపోవడంతో ఆదివారం తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

## సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

**చిక్కడపల్లి:** సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వక్తలు అన్నారు. భగవాన్ శ్రీసత్యసాయిబాబా జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం అశోక్‌నగర్‌లో రాగిజావాను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హిమాయత్‌నగర్ సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధులు టి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

# సమ్మర్.. అలర్ట్

## కలుషిత జలాలు, లీకేజీల కట్టడికి కార్యాచరణ

- ప్రారంభమైన మ్యాన్‌హోల్ పనులు
- అందుబాటులోకి 10 ఉచిత నీటి ట్యాంకర్లు
- వేసవి కోసం జలమండలి అప్రమత్తం



సికింద్రాబాద్‌లోని జలమండలి కార్యాలయం

**సికింద్రాబాద్:** వేసవిలో నీటి ఎద్దడి నివారణకు, లో ప్రెషర్ సమస్యలను అధిగమించేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. లీకేజీలను అరికట్టి కలుషిత జలాల సమస్యలు నివారించేందుకు ఆయా సెక్షన్ కార్యాలయ అధికారులను అప్రమత్తం చేశారు. మురికివాడలు, బస్తీలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. వేసవి ప్రారంభ సమయంలోనే ఎండలు తీవ్రంగా ఉండడం, రాబోయే రోజుల్లో ఎండలు మరింత తీవ్రం కానున్న క్రమంలో సికింద్రాబాద్ ప్రాంత ప్రజలకు నీటి ఇబ్బందులు ఎదురవకుండా ఉండేందుకు చర్యలు ప్రారంభిస్తున్నారు. ప్రత్యేక చర్యల్లో భాగంగా మ్యాన్‌హోల్స్ మరమ్మతులు, కొత్త వాల్వ్‌ల ఏర్పాటు వంటి చర్యలు ఇప్పటికే ప్రారంభించారు.

**ఏడేళ్ల క్రితమే శాశ్వత చర్యలు..**

సికింద్రాబాద్ ప్రాంతానికి ఏడేళ్ల క్రితమే శాంతినగర్, మారేడుపల్లి, తార్నాకలో మూడు కొత్త రిజర్వాయర్లు అందుబాటులోకి వచ్చాయి. నీటి నిల్వల సామర్థ్యం 73 ఎల్‌ఎల్‌డీలకు చేరింది. 46 కిలో మీటర్ల కొత్తపైప్ లైన్లు వేశారు. 200 వరకు పవర్‌బోర్ వెల్స్ వేయించారు. దీంతో అప్పటి నుంచి నీటి కొరత సమస్యలు లేకుండా పోయాయి. అయినప్పటికీ లీకేజీల కారణంతో నీటిరఫరాలో ప్రెషర్ తగ్గడం, కలుషితమైన జలాలు సరఫరా అవుతుండడంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి.

**కలుషిత జలాల కట్టడి కోసం..**

లీకేజీలు, కలుషిత జలాల కట్టడికితొలుత అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇటీవల ప్రారంభించిన 69 కొత్త పైప్‌లైన్ నిర్మాణం పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నాలాలు ఆవరించి ఉన్న లోతట్టు ప్రాంతాల్లో ఎక్కువగా కలుషిత జలాల సమస్యలు ఉంటున్నాయి. నాలాల్లోంచి వాటర్, సీవరేజీ లైన్లు ఉంటుండడం, లీకేజీల ద్వారా తాగునీరులుషితం అంతుండడంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో లీకేజీల నివారణకు దృష్టి సారిస్తున్నారు.

**అందుబాటులోకి 10 ట్యాంకర్లు..**

వేసవి నేపథ్యంలో సికింద్రాబాద్ నియోజకవర్గంలో వాటర్ ట్యాంకర్లను అందుబాటులోకి తెచ్చారు. నియోజకవర్గంలో 5 జలమండలి సెక్షన్ కార్యాలయాలు ఉన్నాయి. సెక్షన్‌కు రెండు చొప్పున మొత్తంగా 10 ట్యాంకర్లను అందుబాటులో ఉంచారు. సాంకేతిక సమస్యలతో నీరు సరఫరా కాని ప్రాంతాలకు లేదా మొత్తంగా నీటి పరఫరా లేని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా ఉచితంగా తాగునీటిని సరఫరా చేసే ఏర్పాట్లు చేస్తున్నారు.

## 'సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలం'





మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమలత

**బన్సీలాల్‌పేట్:** ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు వైఫల్యం చెందారని బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె. హేమలత ఆరోపించారు. ఆదివారం చాచానెహ్రూనగర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన డివిజన్ బీఆర్‌ఎస్ సమావేశంలో ఆమె మాట్లాడారు. డివిజన్‌లో వివిధ రకాల ప్రజాభివృద్ధి పనులు నెలల తరబడి నుంచి ముందుకు సాగడం లేదని దీంతో స్థానిక ప్రజలు పలు ఇక్కట్లకు లోనవుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో పరిపాలన సరిగా సాగడం లేదని ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని కార్పొరేటర్ కె. హేమలత ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మీపతి, ఫయూమ్, అచ్చి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల వైద్యానికి కాంగ్రెస్ సర్కారు అండ



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

**కంటోన్మెంట్:** నిరుపేదల వైద్యానికి కాంగ్రెస్ సర్కారు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఆదివారం పికెట్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలోని 11 మంది సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు మంజూరైన రూ.5.5 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవాళ్లకు సైతం కార్పొరేటర్ స్థాయి వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ నేపథ్యంలోనే నగరానికి నాలుగువైపులా చేపట్టిన టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేస్తోందన్నారు. ఈ ఏడాది చివరి నాటికి అల్వాల్ టిమ్స్‌లో వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

## చిన్నారుల్లో డయాబెటిస్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ వసంత్ కుమార్

**బంజారాహిల్స్:** దేశంలో డయాబెటిస్ బాధపడుతున్న వారి సంఖ్య నానాటికి పెరుగుతుండటం ఆందోళనకరమని ప్రముఖ వైద్యులు వసంత్‌కుమార్ అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో డే సొసైటీ ఆధ్వర్యంలో చిన్న పిల్లల్లో వచ్చే డయాబెటిస్‌పై ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వసంత్‌కుమార్ మాట్లాడుతూ తాము గత 25 ఏళ్లుగా డయాబెటిస్‌తో బాధపడుతున్న నిరుపేద చిన్నారులకు మందులు ఇవ్వడంతో పాటు ఇన్సులిన్ ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. డయాబెటిస్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని 30 ఏళ్లు దాటిన వారంతా షుగర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆహార అలవాట్లు, బరువు పెరగడంతో పాటు పలు కారణాల వల్ల ఎంతో మంది డయాబెటిస్ బారిన పడుతున్నారన్నారు. షుగర్, బీపీ కారణంగా శరీరంలోకి చాలా వ్యాధులు ప్రవేశిస్తున్నాయని ప్రాథమిక దశలోనే వాటిని గుర్తించి దానికి తగిన వైద్యం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని తెలిపారు.

## నిషేధం అర్థరహితం

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూలో ఆందోళనల పై నిషేధం విధించడం అర్థరహితమని తెలంగాణ స్టేట్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ పరుశురామ్ ఆదివారం పేర్కొన్నారు. అనేక ఉద్యమాలకు నిలయమైన ఓయూ ఖ్యాతి నేటి వరకు చెక్కు చెదరలేదన్నారు. విద్యార్థుల ఆందోళనల పై నిషేధం విధిస్తే సమస్యలు పరిష్కారం కావన్నారు. సోమవారం నిర్వహించే బంద్‌కు మద్దతును ప్రకటించారు.

## స్త్రీ లేనిదే సమాజం లేదు

**చిక్కడపల్లి:** స్త్రీ లేనిదే సమాజం లేదని.. మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పలువురు వక్తలు అన్నారు. నర్సయ్య చారిటబుల్ ట్రస్టు విశ్వ విఖ్యాత ఆర్ట్స్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో ఆదివారం ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వర్ధమాన నృత్య కళాకారులతో పాటు చిన్నారుల నృత్య ప్రదర్శనలు ప్రేక్షులను అమితంగా ఆకట్టుకున్నాయి.

## గోమాత సంరక్షణకు 5కే, 10కే రన్

**రాంగోపాల్‌పేట్:** గోమాత రక్షణ, ఆరోగ్యం, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు నెక్లెస్‌రోడ్‌లో ఆదివారం 5కే, 10కే రన్ నిర్వహించారు. మహేశ్వరీ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు యోగా థెరఫిస్టు వీరారెడ్డి ఆధ్వర్యంలో సంజీవయ్య పార్కు నుంచి ప్రారంభమైన ఈ రన్‌లో పెద్ద సంఖ్యలో పర్యావరణ ప్రేమికులు, ఫిట్‌నెస్ అభిమానులు, గో సంరక్షకులు పాల్గొన్నారు.





## ఓయూ పూర్వ విద్యార్థికి అరుదైన అవకాశం



డా.వెంకన్న

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూ పూర్వ విద్యార్థి ఇంగ్లిష్ విభాగం అధ్యాపకులు డాక్టర్ కుంచం వెంకన్నకు కేంద్ర ప్రభుత్వ ఐసీఎస్ఎస్ఆర్ మేజర్ రీసెర్చ్ ప్రాజెక్టు లభించింది. పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ గురుకుల ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఆయన 2024–25 విద్యా సంవత్సరానికి రూ.36 లక్షల రీసెర్చ్ ప్రాజెక్టును పొందారు. ఇంగ్లిష్ భాషపై రెండు సంవత్సరాల పాటు పరిశోధన చేయనున్నారు. దేశంలో 192 మంది అధ్యాపకులకు ఈ ప్రాజెక్టు లభించగా తెలంగాణ నుంచి ఇద్దరు మాత్రమే ఎంపికైన్నట్లు చెప్పారు.

## ట్యాక్సీ డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తా

ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్:** ట్యాక్సీ డ్రైవర్ల సమస్యల పరిష్కరానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. జూబ్లీ బస్ స్టేషన్ సమీపంలోని ట్యాక్సీ డ్రైవర్‌ల యూనియన్ అసోసయేషన్ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలు వివరించారు. జూబ్లీ బస్ స్టేషన్ ఆవరణలో ట్యాక్సీలు నిలుపుకునే స్థలం అనధికారిక డంపింగ్ యార్డుగా మారిందన్నారు. దీంతో ఎలుకలు పెరిగిపోయి, వాహనాల వైరింగ్‌ను కొరికేస్తున్నాయని తెలిపారు. క్యాబ్‌ల పార్కింగ్ ప్రాంతంలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధంగా మారడంతో డ్రైవర్లు విశ్రాంతి, భోజనం చేసేందుకు సైతం ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు.

## గ్రూప్–1 ఫలితాలపై సందేహాలను నివృత్తి చేయండి

**ఉస్మానియా యూనివర్సిటీ:** గ్రూప్–1 ఫలితాల పై అభ్యర్థుల సందేహాలను ప్రభుత్వంతో పాటు టీజీపీఎస్సీ అధికారులు నివృత్తి చేయాలని బీసీ సంక్షేమ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఓయూలో మాట్లాడుతూ గ్రూప్–2, 3 మాదిరిగా గ్రూప్–1 ఫలితాల్లో జనరల్ ర్యాంకింగ్ ఎందుకు ప్రకటించలేదో చెప్పాలన్నారు. వందమంది గ్రూప్–1 టాపర్లలో తెలుగు మీడియం అభ్యర్థులు ఎంతమంది ఉన్నారో బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నేతలు బూర శ్రీనివాస్‌గౌడ్, రవీందర్ పాల్గొన్నారు.

## వాల్మీకి బోయల హర్షం

**ఉస్మానియా యూనివర్సిటీ:** వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని లోక్‌సభలో బీజేపీ ఎంపీ డీకే అరుణ ప్రస్తావించడం పట్ల బోయ హక్కుల పోరాట సమితి (బీహెచ్‌పీఎస్) నాయకులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. అన్ని రంగాలలో వెనకబాటుతో అనాగరికంగా సమాజానికి దూరం జీవిస్తున్న వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించాలని బీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మీనుగు గోపి, యూత్‌వింగ్ అధ్యక్షులు బోయ రమేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## సోషల్ మీడియా పేరుతో అసత్య ప్రచారాలను ఆపాలి

**లాలాపేట:** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ శ్రీరామ్ శివకుమార్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు పరికి నర్సింగరావులు తీవ్రంగా ఖండించారు. ఆదివారం తార్నాకలో విలేకరులతో మాట్లాడారు.అధికారం కోల్పోయిన బాధలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేలా, కించపరిచేలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన ఎంపీ



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు

**రసూల్‌పురా:** కంటోన్మెంట్ బోర్డు రెండవ వార్డు రసూల్‌పురా సీబీఎస్‌నగర్, అర్జున్ నగర్, హనుమాన్ టెంపుల్ చర్చిరోడ్‌లో 70 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టే సీసీ రోడ్డు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే శ్రీగణేష్, బోర్డు నామినేటేడ్ సభ్యురాలు భానుక నర్మద, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డిలతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బస్తీల్లో మౌళికవసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి కంటోన్మెంట్ బోర్డుకు రావాల్సిన సర్వీస్ చార్జీలను విడుదల చేయించేందుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు శ్రవణ్ కుమార్, బీజేపీ నాయకులు అశోక్, మణికంఠ, కిషన్ పాల్గొన్నారు.

## ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి

ఎమ్మెల్యే తలసాని



చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

**అమీర్‌పేట:** సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణతో పాటు ఆరోగ్య విషయంలో సైతం జాగ్రతలు తీసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సీనియర్ సిటిజన్స్‌ను కోరారు.ఆదివారం సనత్‌నగర్ డివిజన్ బీకేగూడలో శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్ట్, ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ వయస్సును లెక్క చేయకుండగా సేవా కార్యక్రమాలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం వేసవి కాలంలో పేదలకు అన్నదానాలు చేసి వేలాది మంది ఆకలి తీరుస్తున్నారని చెప్పారు. ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి యాజమాన్యం శ్రీనివాస సమాజ సేవ చారిటబుల్ ట్రస్ట్‌కు ఎమ్మెల్యే చేతుల మీదుగా సీఎస్ఆర్ నిధుల కింద రూ.10 లక్షల ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో అమీర్‌పేట మాజీ కార్పోరేటర్ ఎన్.శేషుకుమారి, సనత్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి,చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ పార్థసారధి పాల్గొన్నారు.

## ఉద్యమకారుల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడండి



ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులు

**సికింద్రాబాద్:** తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన ఉద్యమకారుల సమస్యలను శాసనసభలో చర్చించాలని ఉమ్యమకారుల ఫోరం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఆదివారం సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావును కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇండ్ల స్థలాలు ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొందని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక మర్చిపోయారని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మల్లారి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

## నిషేధ ఉత్తర్వులు ఉపసంహరించుకోండి

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూలో ఆందోళనల పై నిషేధం విధిస్తూ రిజిస్ట్రార్ జారీ చేసిన సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని ఏఐడీఎస్‌వో నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఓయూ పరిధిలోని సైఫాబాద్ పీజీ కాలేజీలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నితీష్, కార్యదర్శి నాగరాజుతో పాటు వినోద్, స్రవంతి, శశాంక్, ప్రణీత్ కార్తీక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## బాధ్యతలు స్వీకరించిన నూతన కమిటీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేష్

**అడ్డగుట్ట:** మాంగ్ గరోడి సమాజ్ హక్కుల సాధనలో 57 ఎంబీఎస్‌సీ కులాల హక్కుల పోరాట సమితి అండగా ఉంటుందని సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేష్ అన్నారు. ఆదివారం తుకారాంగేట్‌లోని మరాఠా బస్తీలో తెలంగాణ మాంగ్ గరోడి ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన బైరి వెంకటేష్ ముందుగా నూతన కమిటీ సభ్యులైన రాష్ట్ర అధ్యక్షులు ఉపాదే సనాధన్, జనరల్ సెక్రటరీ సకత్ అరుణ్‌లాల్, ఇతర కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారాం చేయించారు. ఎంబీఎస్‌సీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి బస్తీబాట



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఆదం సంతోష్

**అడ్డగుట్ట:** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతీ వారం బస్తీ బాట నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ ఇంచార్జ్ ఆదం సంతోష్‌కుమార్ తెలిపారు. ఆదివారం అడ్డగుట్ట డివిజన్‌లోని లోహియనగర్, ఏ,బి,సీ సెక్షన్లలో పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆదం సంతోష్ మాట్లాడుతూ గత ప్రభుత్వ నాయకులు, అధికారుల వైఫల్యాల కారణంగా ప్రజలు ఎంతో కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నామన్నారు. బస్తీబాటలో కాంగ్రెస్ నాయకులు సృజన్, భరత్‌కుమార్, అమర్‌నాథ్, గంట రాజుసాగర్ పాల్గొన్నారు.